# మాయాబజార్

"పొదుపు చేయండి-అది మీ కర్తవ్యం" అని పెద్ద అక్షరాల్తో కొట్టొస్తున్నట్టు చదువుతున్న పత్రికలో కనపడగానే రంగనాధం ఆలోచన్లో పడ్డాడు. ఈ ప్రకటనలో ఎంతో కొంత న్యాయం వుందనిపించింది. కళ్లజోడు తీసి లాల్చీ కొసతో తుడిచి మొహానికి తగిలించుకోబోతూ-సిగరెట్ ముట్టిద్దామనే ఆలోచన వచ్చి ఆ కళ్ళజోడును అస్తవ్యస్తంగా ముక్కు మీదకు తోసి, సిగరెట్టు పెదిమలకు తార్చి-అగ్గిపెట్టె తీశాడు. ఆ అగ్గిపెట్టె లోపలి సొరుగు తలక్రిందుగా వుండటంవలన, లాగ్గానే పుల్లలు బడి వదిలిన ఆకతాయి పిల్లల్లా నేలమీదకు దూకాయి. పుల్లలకోసం వంగిన రంగనాధం కళ్ళజోడు ముక్కు మీంచి జారి భూమిని ముద్దెట్టుకుంది. పుల్ల లేరటం కోసం కళ్ళజోడు అద్దం బద్దలు కొట్టుకున్నానుగదా అని రవంత చింత చోటు చేసుకుంది. రంగనాధం తాపీగా అగ్గిపెట్టెలోకి ఒక పుల్లకూడా బీరు పోనివ్వకుండా సర్ది-సిగరెట్ వెలిగించుకుని-తాను పొదుపు ఉద్యమం తలపెట్టిన ఉత్తర క్షణాన్నే విరిగిన కళ్ళజోడు అద్దంవంక దీనంగా చూశాడు. అగ్గిపుల్లకోసం వంగటం వలన నలభై రూపాయల ఖర్చు తగులుకుందని అతను పీలయ్యాడు. సిగరెట్ ముందు కాల్చుకుని ఆ తర్వాత అగ్గిపుల్లల వేస్టు గురించి ఆలోచించి వుంటే కళ్ళజోడు నష్టం జరిగేది కాదు. ఆలోచనల క్రమంలో తప్పు ఉంది కాని అగ్గిపెట్టెది ఏవీ తప్పుకాదు అని తోచింది. మరుక్షణంలో అగ్గిపెట్టెలో పుల్లల సొరుగును తలక్రిందులా పెట్టి అమ్మిన కంపెనీమీద డామేజీస్‌కి కేసు వేయాలన్నంత కోపం వచ్చింది. ఆ కంపెనీ నిర్లక్ష్యం వలన రంగనాధానికి నలభై రూపాయల ఆవదం అంటుకుంది. ఈ విధంగా తలక్రిందులుగా వున్న అగ్గిపెట్టెవలన ఇంకెంత మందికి ఇంకెన్ని అనర్థాలు జరుగుతాయో అని భయంవేసింది.

మళ్ళీ అంతరాత్మ ప్రబోధంలా పొదుపు చేయండి అది మీ కర్తవ్యం అని ఎదురుగ్గా

వున్న అద్దంలో రంగనాథం అంతరాత్మ పగిలిన కళ్ళద్దాలతో లాల్చీ పంచెతో దర్శనమిచ్చి ప్రబోధించింది. అంతరాత్మకు లాల్చీ పంచ కళ్ళజోడు వుంటాయా అనే అనుమానం కలిగి- వెధవ అనుమానాల్తోనే జీవితం వేస్టయేలాగుందని రంగనాథం విసుక్కున్నాడు. పగిలిన కళ్ళద్దాలతో పత్రిక చదవడం అసంభవం గనుక పత్రిక నేలమీదకు జారవిడిచి మీదికి చూశాడు. పైన చూరున వేళ్ళాడుతూ బూజులు కనిపించాయి. బూజుల్ని దులపడానికి ఉద్యుక్తురాలైన ఒక మహిళ కుచ్చెళ్ళు ఎగ్గట్టి తలకు పిడపపెట్టుకుని చేతిలో పెద్ద బూజు కర్రతో వచ్చింది. ఈమెను ఎక్కడో చూసినట్లుందనుకుని "ఎవరు నువ్వ"న్నాడు రంగనాథం.

"కళ్ళు కనపడ్డంలేదా" అని ఆ సుందరి గయ్‌మంది. నిజంగా సుందరే తన భార్య- ఎవరో పనిమనిషనుకుని తొందర పడ్డాడు రంగనాథం. క్షమించు అనబోయి ఆ ముక్క పైకిరాక "ఛీ ఛీ" అన్నాడు. "ఛీ ఛీ" అంటున్నా రేవిటి "ఇదోలా" ముందిక్కడనుంచి లేచి అవతలి కెళ్ళండి" అని ఆవిడ శ్రావణ శుక్రవారం దులుపులు బూజుల ఆర్భాటంలో పతిదేవుడ్ని గసురుకుంది.

రంగనాథం ఇవతలకొచ్చి "కళ్ళజోడు పగిలిందే" అని మూలిగాడు. "సంతోషించాం" అని ఆవిడ నడుం బిగించి అద్దాలూ తలుపులూ కిటికీలూ దులపటం ప్రారంభించింది. అలా ఓ చెంప దులుపుతూనే-బజారు చేసుకురండి. అని ఓ లిస్టిచ్చి చెప్పినవి మళ్ళీ మళ్ళీ చెప్పి చెప్పనివి చెప్పకుండా వదిలేసి బయటకు తోలింది.

రంగనాథానికి ఆ లిస్టు చూడగానే అది ఎవరో దయ్యపు చేతితో రాసినట్టు- అగరొత్తులు అగరొత్తులు, అర్టిపళ్ళు అర్టిపళ్ళు, కొబ్బరికాయలు, కొబ్బరికాయలు, అని రాసినవే రెండేసి మార్లు రాసినట్టు కనిపించి "ఇవన్నీ మళ్ళీ మళ్ళీ ఇన్నిసార్లు ఎందుకు రాశావే" అని ఎగిరిపడ్డాడు.

"సరిగ్గానే రాశా-మళ్ళీ చూడండి" అంది ఆవిడ బూజుకర్రకేసి శ్రద్ధగా, తనవైపు అశ్రద్ధగా చూస్తూ-రంగనాథం "సర్లె" ఎందుకో అన్నీ డబుల్‌గా కనిపిస్తున్నాయనుకుని సర్దుకున్నాడు. ఇల్లు దాటాక కూడా గేటు, మెట్లు, రోడ్డు అన్నీ వంకరటింకరగాను అడ్డదిడ్డంగానూ, ఎదురువుతున్న మనుషులు రెండు మూడు తలకాయల్తోనూ కనిపించసాగారు.

చెట్లు ముందుకు వాలుతున్నాయి. వచ్చేపోయే కార్లకు ఇటు రెండు అటు రెండు నాల్గేసి చక్రాలున్నాయి. సైకిళ్ళ మీద ముందుకుపోతున్న వాళ్ళ ఒక్కొకరు రెండేసి సైకిళ్ళ మీద ఒకసారే ఫీట్లు చేస్తున్నట్లున్నారు. వీధుల్లో ఇళ్ళు ముందుకు వచ్చి కదులుతున్నాయి. ఒక గేదెకు నాలుగు కొమ్మలు రెండు తోకలు కనిపించాయి. ఇహ రోడ్డు-పల్లంగా వున్నచోట ఎత్తుగా వున్నచోట పల్లంగానూ ఉంది. తనను పరాభవించ డానికి లోకం అంతా వైఖరి మార్చుకున్నట్లనిపించింది రంగనాథానికి.

ఇహ-బజార్లో-

అంతా మాయాబజారే!

రంగనాధానికో రూలుంది ఏ పని ప్రారంభించాలన్నా విఘ్నేశ్వరునికి మొక్కుకున్నట్లు-బజారులో అడుగు పెట్టగానే మొట్టమొదట కాఫీహోటలుకెళ్ళాలి. అలా కాఫీహోటలు మొహం చూడకుండా యకాయకీ ఏ పన్లోనూ జొరబడ్డానికి మనసు వప్పదు. అంచేత ముందుగా లక్ష్మీవిలాస్ కాఫీక్లబ్బులోకి దూరాడు. కాఫీహోటలు కిక్కిరిసిపోయింది. అయిపోయిన వాళ్ళెవరైనా చేతులు కడుక్కున్నారేమో చూసి వెనక చేతులు కట్టుకుని నిలబడదాం అనుకున్నాడు. అతనికి తింటున్న మనుషుల్ని చూస్తే అసహ్యం వేసింది. అంతా రెండు చేతుల్తో తింటున్నారు.అందులో ఒకతనికి అర చేతికి పదివేళ్ళున్నాయి. పదివేళ్ళతో దోసెను చీలుస్తున్నాడు. ఓచోట సర్వరుకుర్రాడు. కాఫీని హిందుస్థానీ కాఫీని సాగిదీసినట్లు సాగదీస్తున్నాడు. అంతవరకూ బానేవుంది. కప్పులోంచి గ్లాసులోకి సాగదీసిన కాఫీ రెండు నాల్కల్లాగ రెండుగా గండుపిల్లి మీసాల్లా దూసుకుని వస్తోంది. అది చూడ్డానికే భయం వేసింది. ప్రతి కుర్చీకి అయిదో ఆరో కాళ్ళున్నాయి. ఈ హోటలువాడికి బుర్ర తిరిగిందనుకున్నాడు. అన్నుని ఓ కుర్చీలో కూలబడి రెండు ముక్కులు నాలుగు కళ్ళున్న ఒక సర్వరుకి ప్లేటిడ్లి ప్లేటు సాంబారూ సింగిల్ వడై ఆర్డరిచ్చాడు. వాడితో నాలుగిడ్లి రెండువడై రెండు సాంబార్లు ఎందుకు తెచ్చావని పోట్లాడాడు. పక్క కుర్చీలో ఆసామీ కల్పించుకుని అవి ప్లేటిడ్లి సింగిల్ వడై సాంబారేనని నచ్చజెప్పాక వూరుకున్నాడు. టిఫినయాక ఇలా నాలుగుకళ్ళు రెండు ముక్కులు అరచేతికి పదివేళ్ళున్న వాళ్ళని సర్వర్లుగా ఎందుకు పెట్టుకున్నావని ప్రొప్రయిటరుతో దెబ్బలాడాలనుకున్నాడు. లోకం యింత అవకతవకగా వున్నప్పుడు ఎన్నిటికని మనం కలగచేసుకుని మనం దెబ్బలాడగలం- కంఠశోష అని మళ్ళీ వూరుకున్నాడు. ఇంటి దగ్గరలేని ఆకలి బజారులోకి రాగానే పడగ విప్పింది. పక్కవాడు బజ్జీలు తింటూంటే-పొరుగువాడ్ని చూసి నేర్చుకోవాలనుకుని తనూ బజ్జీలకి ఆర్డరిచ్చాడు. రంగనాధం లెఫ్టిస్టు ఎడమ కంట్లోంచి తన ప్లేట్లోకి చూస్తే నాలుగు బజ్జీలున్నాయి. కుడికంటితో గమనిస్తే పక్కవాడి ప్లేట్లో ఎనిమ్మిది బజ్జీలున్నాయి. రంగనాధం అనుమానించాడు. పాత జోకు గుర్తుచేసుకుని "మీరు హోటలు ప్రొప్రయిటరా" అన్నాడు. "కాదు నేత్రవైద్యుడ్ని" అన్నాడతను. "ఎనిమిది బజ్జీలుంటే మీరు హోటలు ప్రొప్రయిటరేమో అనుకున్నా" నన్నాడు రంగనాధం. అతను తన విజిటింగు కార్డిచ్చి సాయంత్రం ఓమాటు మా ఆస్పత్రికి రండి. ఉచితం పరీక్ష" అన్నాడు. "చాలా థాంక్సండి" అని బజ్జీలు తింటున్న పచ్చిడిచేతితో అతనికిషేక్ హేండిచ్చి- ఆ తర్వాత తన రుమాలు తీసిచ్చాడు చేతులు తుడుచుకోండని.

ఆ కుర్చీలోకి ఒక సైజు మనిషి ఖద్దరులో వచ్చాడు. చిత్రం- ఆ ఆసామీ రెండు

కండువాలు ఒకే భుజంమీద వేసుగోడం చూసి రంగనాధానికి నవ్వొచ్చి-నవ్వడం బాగోదని ఆపుకుని- ఆయన చంకలో రెండు పత్రికలున్నట్లు చూసి-ఈయన ఒకే పత్రిక రెండు కాపీలెందుకు కొన్నట్లు అని ఆలోచించి-ఇతగాడికన్నీ డబల్ సర్వీసుకామోనులే అని వూరుకోలేక-"రెండు పత్రికలున్నాయి ఓటిస్తారా?" అని అడిగాడు. అసలా ఖద్దరూ మనిషికి నవ్వబోయి నవ్వాపుకున్న ఈ వ్యక్తిని చూస్తేనే చిరాగ్గా వుంది ఇస్తాను, ఇవ్వను అనకుండా "పచ్చడి చేతితో పత్రిక చదవకూడదండీ" అని హెచ్చరించాడు. రంగనాధం అదేమీ పట్టించుకోకుండా "మీరు కొత్తకాంగ్రెస్సా" అన్నాడు. కొత్త కాంగ్రెసులో చేరినవాడు రెండు కండువాలు రెండు టోపీలు పెట్టుకుంటాడని అతనికి ధ్వనించేలా ఖద్దరు పత్రిక తీసియిచ్చి న్యూసెన్సు వదిలించుకున్నట్టు బోయిని పిల్చి తిండి కార్యక్రమం గురించి ఆర్డరివ్వసాగాడు. రంగనాధం కాఫీ తాగూతూ, పత్రిక ముఖానికి అడ్డం పెట్టుకుని హోటల్లో పైన సీలింగుని పరీక్షించి -తల క్రిందకు దించి గోడకు తగిల్చిన పటాలకేసి శ్రద్ధగా పరీక్షగా చూడ్డం ప్రారంభించాడు. అక్కడేం కనిపించిందో అతను ఆపుకోలేక పుసుక్కున నవ్వేశాడు. ఖద్దరు ఆసామీ కొంచం కంగారుపడి "ఏమండి ఏవిటి?" అని కళ్ళతో ప్రశ్నించాడు.

రంగనాధం "చెప్పకూడదు లెండి. బాగుండదు. హోటల్లోకి అమ్మాయిలొస్తున్నారు కూడాను" అని కాలేజీ అమ్మాయిలు బిలబిలా రావడం చూసి-ఆపుకోలేక మళ్ళీ నవ్వాడు. అమ్మాయిలంతా ఒక్కసారి ఫ్రీజయి చిరాగ్గా అతనికేసి చూశారు. ఏళ్ళొచ్చి కూడా బుద్ధిలేనివాళ్ళను చూసినట్లు-

రంగనాధం కాఫీతాగి బిల్లు చెల్లిస్తూ-మళ్ళీ పుసిక్కిన నవ్వాడు.అట్టే చిరాకు పడకుండా "ఎందుకల నవ్వుతారు" అన్నాడు రెండురూపాయలనోటును లోపలకు తోసి రూపాయనోటు ముందు పెడుతూ

"అదేంటి బలేవారే-రెండురూపాయ లెందుకిస్తారూ?" అని రంగనాధం అనేసి-యిచ్చింది తీసుకుని "ఈ హోటల్లో టిఫిన్ చేశాక మనం రెండు రూపాయల నోటిస్తే తిరిగి మనకు రెండు రూపాయల నోట్లు యిచ్చేస్తారు-బానేవుంది" అనుకున్నాడు. ఖద్దరువాలా బయటికొచ్చి "ఇందాక నన్ను చూసేనా మీరు నవ్వింది" అని గంభీరంగా అడిగాడు రంగనాధం అతని అజ్ఞానానికి నొచ్చుకుంటూ-"మీకేసి కాదండీ గోడనున్న పార్వతీ అమ్మవారి బొమ్మకేసి చూసి"

"చాల్లెండి. ఆ బొమ్మని నేనీ హోటలుకొచ్చినప్పట్నుంచి గోడమీద చూస్తున్నాను. అందులో నవ్వడానికేంవుంది?"

"మీకేం కనపడలా? అసలిలాటి తెలివితక్కువ ఆర్టిస్టుల్ని ఎందుకు ప్రోత్సహిస్తారో?" అన్నాడు విచారంగా రంగనాధం.

"అది జర్మన్ ప్రింటండీ బాబూ- రవివర్మది. తెలివి తక్కువ ఆర్టిస్టంటారేవిటి?"

"ఏ వర్మో-అందులో అమ్మవారికి రెండు సున్నాలుండాలి. మూడేశాడు. చచ్చే నవ్వొచ్చింది నాకు"

ఆ ఖద్దరు ఆసామీ "పదండి లోపలికెళ్ళి చూద్దాం" అన్నా రంగనాధం "మీరెళ్ళి చూసిరండి. నాకు ఓపికలేదు నవ్వడానికి" అని బజారులో పడ్డాడు. అన్నాడేగాని నవ్వకుండా వుండలేకపోయాడు. ఒక కుర్రాడు అర్టిపండు ఒలిచి తింటున్నాడు. తిండం పూర్తయ్యాక తొక్కలు విసిరేశాడు. చిత్రం ఒక పండుకి రెండు అరటిపళ్ళు తొక్క లుంటాయా-ఒక మనిషి రెండు కోట్లు తొడుక్కునట్లు- రంగనాధానికి ఆ అర్టిపండు తొక్కతీసి రోడ్లుమీద పోయే నలుగుర్నీ కేకేసి-ఈ గమ్మత్తుని వివరించి చెప్పాలనుంది. ఏమో-ఇంటికెళ్ళాక సుందరిని దగ్గర కూర్చోబెట్టుకుని చెప్పాలి అమ్మవారికి మూడు సున్నాలు, అరిటిపండుకి రెండు తొక్కలూ వున్న సంగతి- కాని ఛీ ఛీ అని మొహం పెట్టేస్తుంది. తెలివైన వాళ్లనర్థం చేసుకోడానికి తెలివైన వాళ్ళే వుండాలి-పెళ్ళాలు పనికిరారు.

రంగనాధం బజారులో నడుస్తున్నాడు, నడుస్తున్నాడే కాని అతని మనసు అతని దగ్గర వుండకుండా కోతిలా గంతులేస్తోంది.

దారి మధ్యలో ట్రాఫిక్ కానిస్టేబుల్ రెండు టోపీలు పెట్టుకుని నోట్లో రెండు విజిల్సు పెట్టుకుని వూత్తున్నాడు. ఒక టోపీ ఒక విజిలు ట్రాఫిక్ కానిస్టేబులుకి చాలవా అనుకున్నాడు రంగనాధం ఎవరూ అడగరేవిటనుకుని తను వెళ్ళి మెల్లగా అడిగాడు. వినిపించుగోకుండా పోలీసరచేత్తో కసిరేశాడు. రంగనాధం చేసేది లేక ఇంకాస్త ముందుకు వెళ్ళి లాంతరుస్తంభం అడ్డురాగా తలెత్తిచూశాడు. రామాంజనేయయుద్ధం పోస్టరు కనపడింది. రంగనాయకమ్మ విషవృక్షం చదివాక ఆవిడమీద గౌరవం పెరగలేదుకాని రామాయణం మీద గౌరవం తగ్గింది. ఎంత తగ్గినా ఈ వాల్‌పోస్టరువాడు ఆంజనేయస్వామికి రెండు తోకలూ, రావణుడికి పన్నెండు తల కాయాలూ వేసాడా? రంగనాధం మళ్ళీ మళ్ళీ లెక్కపెట్టాడు. ఎన్నిసార్లు లెక్కపెట్టినా రెండు తోకలూ-పన్నెండు తల కాయలూ వస్తున్నాయి. డైరెక్టరేవన్నా మార్చాడేమోనని కొంతసేపు అనుమానించాడు.

రంగనాధానికి చాలాకోపం వచ్చేస్తోంది. ఎవడిబుర్రన్నా బద్దలు కొట్టెయ్యాలనిపిస్తోంది. లోకంలో యింత అజ్ఞానం ఇంత అసందర్భం వుందేవిటనిపిస్తోంది. సరేవుందయ్యా దీన్నెవడూ ప్రశ్నించడేవిటి?

తెల్లారి లేచాక-అమ్మవారికి మూడు సున్నాటేవిటి? పోలీసుకి రెండు టోపీలెందుకు? ఆంజనేయస్వామికి రెండు తోకలూ రావణాసురునికి పన్నెండు తలకాయలేవిటి? ఏదో ఒకటి చేసెయ్యాల్చే సెయ్యాలనిపించింది రంగనాధానికి. అతను రోడ్డుమీద పోయేవారిని పిల్చి-"ఇదిగో మాస్టారూ-రావణాసురుడికెన్ని తలలు? హనుమంతుడికి ఎన్ని తోకలు?" అని అడిగి వాళ్ళు తెల్లబోతే వాల్ పోస్టరు కేసి చూపించి లెక్క పెట్టందే కదలొద్దన్నాడు.

వాళ్ళు పది తలలంటే మళ్ళీ లెక్కపెట్టమన్నాడు. అక్కడో పెద్ద గుంపు పోగయింది-మధ్యలో చెమటలు కక్కుకుంటూ రంగనాథం.

ఇంతలో "హలో మిత్రమా" అంటూ విశ్వం ఆ గుంపులోకి జొరబడ్డాడు. విశ్వం రంగనాథం చాలామంచి గొప్పస్నేహితులు. విశ్వానికి రంగనాథాన్ని చూస్తే ముందు ఆశ్చర్యము తర్వాత భయం వేసింది. మనిషి పూనకం వచ్చిన వాడిలా వున్నాడు. అందర్నీ అడిగినట్లుగానే విశ్వాన్నీ అవే ప్రశ్నలడిగాడు. విశ్వం జవాబివ్వకుండా మనిషి వాలకం పరీక్షించి "ఏం వాసనేం లేదే-అలా ఎందుకు మాట్టాడుతున్నాడు?" అని తన్ను తాను ప్రశ్నించుకుని రెక్క పుచ్చుకుని ఆ గుంపులోంచి బయటకు లాక్కొచ్చాడు. "కాని, ఎందుకో మిజరబుల్గా వుందోయ్ లోపల" అన్నాడు రంగనాథం "నాకు అప్పుడప్పుడు అలాటి ఫీలింగొస్తూ వుంటుందిగురూ" అన్నాడు విశ్వం. ఇద్దరు రిక్షా ఎక్కారు. "మినీబార్కి పోనియ్" అన్నాడు విశ్వం. "శ్రావణ మాసమోయి. శ్రావణ శుక్రవారం. మా ఆవిడ అవీయివీ బోల్డు చెప్పిందోయ్ తెమ్మని" అంటూ నసిగాడు రంగనాథం.

"ఏవిటి శ్రావణ శుక్రవారం లేడీస్కేగాని మనకు లేదా? వుండకూడదా?" అన్నాడు విశ్వం.

"మనంకూడా సెలిబ్రేట్ చేద్దావంటావా?" అన్నాడు రంగనాథం.

"అదేగదా తాత్పర్యం"

ఇద్దరూ మినీబార్ దగ్గర దిగారు బార్ వాడు డోర్ తెరిచాడు. పై కెళ్ళారు. అలా పైకి వచ్చిన వాళ్ళు కొందరు అక్కడా అక్కడా నక్షత్ర మండలంలో సత్పురుషుల్లా కూర్చున్నారు దూరందూరంగా. గ్లాసుల గలగలలు సోడాల బుసబుసలు ప్రారంభమయ్యాయి. వెనకనుంచి అనవసరపు సంగీతం గోలగా వినిపిస్తోంది. రంగనాథం యథాప్రకారం మాట్లాడాలని ప్రయత్నిస్తున్నాడు. విశ్వం అతన్ని మాట్లాడనివ్వడం లేదు.

"మాట్లాడకపోతే మందెక్కువ లోపలికెళుతుందోయ్" అన్నాడు రంగనాథం. "తప్పదుగదా-వెళుతుంది మరి" అన్నాడు విశ్వం ముక్తసరిగా. కొంత సేపయాక రంగనాథం-

"ఈ పేపరువాడు ప్రధానికి పొట్టలో చుక్కపెట్టాడు కదా గాంధీక్కూడా పొట్టలో చుక్క వుంటుందా?" అని అడిగాడు రంగనాథం.

"ఇదిగో ఈ పకోడీలు తిను" అని కొన్ని పకోడీలు చేతిలో పెట్టాడు విశ్వం.

మరికొంత సేపయాక-

"మన కంట్రీలో ఆర్టంతా తగలడిందోయ్, విశ్వం. పార్వతీదేవికి మూడు సున్నాలేవిటోయ్ ఆశ్చర్యం?"

"అదంతేలే-వాళ్ళు తల్చుకుంటే-మగదేవుళ్ళక్కూడా సున్నాలు పెట్టేస్తారు."

రంగనాథం విశ్వం లోకంగురించి, అందులోని హెచ్చుతగ్గులు అవకతవకలు అజ్ఞానం

గురించి. చాలాసేపు వితర్కించి విచారించి చెరో ఆరుగ్లాసులు ఖాళీ చేశారు. చెరో పదిహేను సిగరెట్టులు వూదేశారు.

"గురూ మనం తూలకూడదు."

"ఛ ఛ"

"రిక్షాలో జాగ్రత్తగా వెళ్ళగల్రా"

"హ్హా-డోంట్ వర్రీ"

ఇద్దరూ చెరో రిక్షా ఎక్కారు.

రంగనాథం సిగరెట్టు వెలిగించి రిక్షావాలాతో హస్కు ప్రారంభించాడు.

"హరే బ్రదర్-హనుమంతుడికి ఎన్ని తోకల్రా?" వాడు మాట్లాడకుండా రిక్షా తొక్కుతున్నాడు.

"చెప్పరా రాస్కెల్- చెబితే రూపాయిస్తాను. హనుమంతుడికి ఎన్ని తోకల్రా?"

"ఎన్నుంటాయండి? ఒకటేనండి?"

"పో తీసుకోఫో రూపాయి"

"మనిళ్ళు ణీకు తెల్సురా"

"తెల్సండి. ఆర్నీ మిమ్మల్నీ మనవేగదండీ మోసుకెళ్ళేది రోజూ-"

"ఆళ్‌రైట్-రావణాసురుడికి హేన్ని తలలు?"

"పది బాబూ-"

"తీసుకో ఫో మరో రూపాయ్."

"దిగండి. బాబూ-జాగర్తగా వెళ్ళండి."

"ఇదిగోరా రెంద్రూపాయల నోటు"

"బాబూ ఇది రెంద్రూపాయలు కాదండి."

"ణీకు దగా చేస్తానంట్రా- అది రెంద్రూపాయ్ పటిగెళ్ళు"

"ఇది కొత్త ఇరవైరూపాయల నోటండి బాబయ్యా- తీసుకోండి"

"హొద్దురా- రెంద్రూపాయ్ ఇరవై రూపాయ్ ఎలాగవుతుంది? అది రెంద్రూపాయ్ తీసుకో-నాకు మనసు బాగోలేదు."

రిక్షావాడు వెళ్ళిపోయాడు. రంగనాథం టకటక మెట్టెక్కి మీదకెళ్ళి తలుపుమీద టకటక కొట్టాడు. సుందరి నిర్ఘాంతపోయి తలుపు తీసి-మళ్ళీ నిర్ఘాంతపోయి,

"పొద్దుననగా వెళ్ళారు-ఇప్పుడా రావటం? అక్కడే వుండకపోయారా?"

"శ -శ - ఇవ్వాళ శ్రావణ శుక్రవారమ్-ణేనూ విశ్వం షావణ శుక్రవారం సేసుకున్నామ్-మగాళ్ళు కూడా షేవణ శుక్రవారం షేసుకుంటే మీకంతా మంచి అవుద్దిట."

"సరి-లోపలికి రండి చెప్పులేవి? కళ్ళజోడు ఏది?"

"ఏమోనే-మాయాబజారులో ఎక్కడొదిలేషానో..."